
# సాక్షి
## తూర్పుగోదావరి

శనివారం | 27 | ఏప్రిల్ | 2024




### 'సెల్'వుల్లో ఆటలేనా..!

వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారోనని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.. 8లో



### 5,950 క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.45 అడుగులు ఉంది.

గరిష్టం/కనిష్టం
42.5° / 26.0°

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 42.5 | 26.0 |
| కాకినాడ | 39.7 | 27.6 |
| అమలాపురం | 40.0 | 26.0 |

## న్యూస్‌రీల్

### ఎన్నికల విభాగాల పరిశీలన



ఎన్నికల విభాగాలను పరిశీలిస్తున్న బాలసుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పార్లమెంటు నియోజక వర్గ సాధారణ పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం సువిధ, సీ విజిల్, ఎంసీసీ, మీడియా సెల్, మీడియా మోనిటరింగ్ సెల్, 1950 కాల్ సెంటర్, చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ టీవీల విభాగాలను పరిశీలించారు. సువిధ ద్వారా అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో, నేరుగా వచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. సీవిజిల్‌కి వస్తున్న ఫిర్యాదులను 30 నిమిషాలలోగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ మాధవీలత వివరించారు. ఎంసీసీ ఉల్లంఘనలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా రికార్డులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారుల ద్వారా నోటీసు అందజేస్తున్నామన్నారు. మీడియా మానిటరింగ్ విభాగంలో 16 న్యూస్ చానళ్లకు సంబంధించి జిల్లాకి చెందిన ప్రతికూల, అనుకూల వార్తలను మూడు షిఫ్టులలో సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అనుకూల, ప్రతికూల, చెల్లింపు వార్తలను గుర్తించి ఆయా రిటర్నింగ్ అధికారుల ద్వారా అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, డీపీఆర్వో ఐ.కాశయ్య, రూడా వీసీ బి.బాలస్వామి, మార్కెటింగ్ ఏడీఎం సునీల్ వినయ్ పాల్గొన్నారు.

### నేడు పాలిసెట్

- జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల కేటాయింపు
- హాజరుకానున్న 5,368 మంది విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం పాలిసెట్-2024 నిర్వహించనున్నట్టు బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాలలో ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ వెంట తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,368 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో రెండు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీవిజయదుర్గా జూనియర్ కాలేజీ ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం స్కూల్, రాజానగరంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు, పాలచర్లలో బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు, భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.

### తుళ్లిపడుతున్న బేళ్లు!

- వర్జీనియా పొగాకు ఆల్‌టైమ్ రికార్డు ధర
- రైతుల ఆనందం



దేవరపల్లి వేలం కేంద్రంలో కనుగోలు చేసిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర అదిరింది. పొగాకు ధర చరిత్రలోనే రికార్డు సాధించింది. కొనుగోళ్ల ప్రారంభంలో మార్కెట్‌పై నిరుత్సాహం వ్యక్తం చేసిన రైతులు ప్రస్తుతం లభిస్తున్న ధరను చూసి పండగ చేసుకుంటున్నారు. రోజుకు కిలోకు 25 నుంచి 30 ధర పెరుగుతుంది.

గురువారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.303 , కనిష్ట ధర రూ.228, సగటు ధర రూ.244 రైతులకు లభించగా, శుక్రవారం పెరిగిన ధర ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. కిలో గరిష్ట ధర రూ.327, కనిష్టం రూ. 235, సగటు ధర రూ. 295 లభించింది. మార్కెట్లో ధర రికార్డు స్థాయికి చేరుకోవడంతో రైతులు వేలం కేంద్రాలకు తీసుకువస్తున్న బేళ్ల సంఖ్య పెరిగింది. శుక్రవారం రాజమహేంద్రవరం పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాలు మొత్తం ఐదు వేలం కేంద్రాలకు 5,694 బేళ్లు వేలానికి రాగా, 4,786 బేళ్లు, 5,83,502 కిలోల పొగాకు కొనుగోలు చేశారు.

# చిన్నమ్మకు పెద్ద ఒణుకు!

- పురందేశ్వరికి ఆందోళన రేకెత్తిస్తున్న అనపర్తి సెంటిమెంట్
- రాజమండ్రి ఎంపీ స్థానంలో గెలుపును నిర్ణయిస్తున్న అనపర్తి ఓటర్లు
- వారు ఒకే పార్టీ వైపు ఉంటారని ప్రతీతి
- గతంలో పోటీ చేసిన మురళీమోహన్‌కు చేదు అనుభవం
- 50 వేల మెజారిటీతో విజయం సాధించిన ఉండవల్లి
- ప్రస్తుత ఎంపీ భరత్‌రామ్‌కు సైతం 60 వేలకు పైగా మెజార్టీ అక్కడి నుంచే
- తన ఓటమి తప్పదని భయపడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు







పురందేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ సెంటిమెంట్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆందోళన రేకెత్తిస్తోంది. బీజేపీ తరఫున ఎన్నికల్లో బరిలోకి దిగిన ఆమెను ఓటమి భయం వెంటాడుతోంది. ఇందుకు గతంలో జరిగిన ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పే కారణం. అనపర్తి నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీకి ఓటేయ్యాలని భావిస్తే.. ఏకమొత్తంగా వేసేసి ఆ పార్టీకి భారీ మెజార్టీ అందిస్తారన్న పేరు ఉంది. అనపర్తిలో 2.22 లక్షల మంది ఓటర్లున్నారు. ఏ పార్టీకి మొగ్గుచూపినా 50 వేలకు పైగా మెజార్టీ ఇచ్చేస్తారు. ఇందుకు గత ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. 2009వ సంవత్సరంలో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మురళీమోహన్ పోటీ చేశారు. ఆయనకు రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో స్పష్టమైన మెజార్టీ దక్కింది. కేవలం అనపర్తి నియోజకవర్గం నుంచి మాత్రం భంగపాటు ఎదురైంది. నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో అప్పటి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఒక్క అనపర్తి నియోజకవర్గం నుంచే 60 వేల ఓట్ల మెజార్టీ లభించింది. అన్ని నియోజకవర్గాలు కలిపి 50 వేల ఓట్ల ఆధిక్యంలో ఉన్న టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అనపర్తి దెబ్బకు 10 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న మార్గాని భరత్‌రామ్‌కు 2091 ఎన్నికల్లో 1,21,634 మెజార్టీ రాగా అందులో 62,000 ఓట్ల మెజార్టీ ఒక్క అనపర్తి నియోజకవర్గం నుంచే రావడం విశేషం. ఇలా ప్రతి ఎంపీ గెలుపులో అనపర్తి నియోజకవర్గం కీలక భూమిక పోషిస్తోంది. ప్రస్తుతం అనపర్తిలో తలెత్తిన పరిణామాల నేపథ్యంలో ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారు. ఈ పరిణామం ప్రస్తుతం రాజమండ్రి పార్లమెంట్ చర్చనీయాంశంగా మారింది.

**అనపర్తిపై బీజేపీ దృష్టి**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క అసెంబ్లీ స్థానంలోనైనా పోటీ చేయాలన్నది బీజేపీ అధిష్టానం ఆలోచన. అందులో భాగంగానే తొలుత అనపర్తి నుంచి రంగంలోకి దింపాలని భావించారు. ఆ నియోజకవర్గంలో బీజేపీకి తగిన అభ్యర్థి లేకపోవడంతో పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును బరిలోకి దింపాలన్న ఆలోచన చేసింది. ఇందుకు ససేమిరా అన్న సోము తనకు రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్‌లో ఏ స్థానం ఇచ్చినా ఫర్వాలేదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందుకు టీడీపీ అధినేత నిరాకరించినట్టు సమాచారం. దీంతో పునరాలోచనలో పడ్డ బీజేపీ అనపర్తిలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతను వెతికేపనిలో పడింది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బెంగళూరుకు చెందిన ఓ వ్యాపారవేత్తను పోటీ చేయించాలని భావించింది. సదరు వ్యాపార వేత్త వద్దకు ప్రతిపాదన తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆయన సైతం అనపర్తిలో పోటీకి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో మాజీ సైనికుడు శివరామకృష్ణంరాజును ఎంపిక చేశారు. ఇక్కడే అసలు సమస్య ఎదురైంది.

**2009 సంఘటన పునరావృతం అవుతుందా?**

అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బీజేపీకి క్యాడర్ లేదు. ప్రస్తుతం ఓటర్లు వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికే పట్టం కట్టాలని భావిస్తున్నారు. దీనికితోడు అనపర్తి సీటు విషయమై కొన్ని రోజులుగా టీడీపీలో గందరగోళం నెలకొనడం, నాటకీయ పరిణామాల మధ్య టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. స్వప్రయోజనాల కోసం పార్టీ ప్రతిష్టను తాకట్టు పెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్న నల్లమిల్లికి ఓటమి తప్పదని, ఆ ప్రభావం పార్లమెంట్ అభ్యర్థి అయిన తనపై పడుతుందన్న భయం పురందేశ్వరిని వెంటాడుతోంది.

**రంగంలోకి దిగిన పురందేశ్వరి, చంద్రబాబు**

అనపర్తి ఆందోళలను ఆసరాగా తీసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి రంగంలోకి దిగారు. తమ స్వప్రయోజనాలే లక్ష్యంగా సొంత పార్టీ నేతను కాదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికి సీటు కట్టబెట్టేందుకు పురందేశ్వరి పావులు కదిపారు. పార్టీ నేతలు విభేదిస్తున్నా పట్టించుకోని పురందేశ్వరి నల్లమిల్లిని బీజేపీలోకి చేర్చుకున్నారు. వెంటనే ఆ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దింపారు. ఈ పరిణామాలు గమనిస్తున్న బీజేపీ, టీడీపీ శ్రేణులు రాజకీయ విలువలను మంట పెట్టారంటూ ఇద్దరు నేతలపై దుమ్మెత్తి పోస్తున్నారు.

# 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో వచ్చే నెల 24 నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నర్సింహం శుక్రవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 1 నుంచి 4 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. నైతికత, మానవీయ విలువలు పరీక్ష 6వ తేదీన, పర్యావరణ విద్య పరీక్ష 7వ తేదీన జరుగుతాయన్నారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజు, రీ వాల్యుయేషన్, రీ కౌంటింగ్‌లకు దరఖాస్తు చేసుకునేవారికి ఈ నెల 30వ తేదీతో ఫీజు గడువు ముగుస్తుందన్నారు. విద్యార్థులు తమ కళాశాలల్లో ఫీజు చెల్లించాలన్నారు.

## ముస్లిం రిజర్వేషన్లపై
# కూటమి వైఖరి ఏమిటి?



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిఫ్ తదితరులు

**జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్**

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తాము అధికారంలోకి వస్తే తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని పదే పదే ప్రకటిస్తున్న బీజేపీ నాయకుల వైఖరిపై కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్పష్టమైన ప్రకటన చేయాలని తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్ డిమాండ్ చేశారు, శుక్రవారం వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. దళితులు, గిరిజనుల కంటే తీవ్రమైన దారిద్ర్యంలో ముస్లిం సమాజం ఉందన్నారు. ఆనాడు జస్టిస్ సచార్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఆ రిజర్వేషన్ల ఫలితంగా నిరుపేదలైన కూలి పనులు చేసుకునే ముస్లింల పిల్లలు సైతం డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఉద్యోగాలు పొందారని, దానికి కొనసాగింపుగా ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలలో సైతం రిజర్వేషన్లు అమలు చేస్తూ చట్టసభలతో పాటు అన్ని రంగాల్లోనూ ముస్లింలకు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు పదే పదే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించడం ఆ వ్యాఖ్యలను ఖండించి ముస్లింల ప్రయోజనాలను కాపాడాల్సిన కూటమి పక్ష నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు మౌనం వహిస్తూ అంతర్గతంగా ముస్లింల రిజర్వేషన్లు రద్దును ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీలతో చేయి కలిపి పేద ముస్లింల ప్రయోజనాలకు భంగం కలిగించే విష సంస్కృతిని రాష్ట్రంలోకి తీసుకువస్తే మాత్రం చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. నగర అధికార ప్రతినిధి మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు ఆరిఫుల్లా ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రమీజ్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ షట్టర్ బాషా, జిల్లా డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇమామ్ పాల్గొన్నారు.

# నామినేషన్ల పరిశీలన పూర్తి



నామినేషన్ల పరిశీలన సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మాధవీలత, చిత్రంలో అబ్జర్వర్ సుబ్రహ్మణ్యం

**పార్లమెంట్ పరిధిలో నామినేషన్లను పరిశీలించిన అబ్జర్వర్ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మాధవీలత**

రాజమహేంద్రవరం రూరల్/ సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లాలో శుక్రవారం రాజమండ్రి పార్లమెంటుకు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు దాఖలైన నామినేషన్ పత్రాలను పరిశీలించి సక్రమంగా ఉన్న వాటిని ఆమోదించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా లేని వాటిని తిరస్కరించామని తెలిపారు. ఇందుకు సంబంధించిన కారణాలను ప్రతినిధులకు తెలియజేశామన్నారు. పార్లమెంటు నియోజకవర్గ నామినేషన్ల పత్రాలను అబ్జర్వర్ కె.బాలసుబ్రహ్మణ్యం పరిశీలించారు. రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బహుజన సమాజ పార్టీ - గణేశ్వరరావు పరమట, భారతీయ జాతీయ కాంగ్రెస్ - గిడుగు రుద్రరాజు, వైఎస్సార్ సీపీ - డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీజేపీ - దగ్గుబాటి పురందేశ్వరి, నవరంగ కాంగ్రెస్ పార్టీ - బత్తుల బలరామకృష్ణ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్)- మేడా శ్రీనివాసరావు, జై భారత్ నేషనల్ పార్టీ - మోహనరావు శింగులూరి, స్వతంత్ర అభ్యర్థులుగా జల్లి బాలనవీన, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, భానుచందర్ కురువెళ్ళ, డాక్టరు మెడిసి రత్నారావు అలియాస్ వినయ్, సాళోపంతుల రాఘవేంద్రరావు నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ తరపున గూడూరి రాధిక, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) వారా ప్రభాకర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ - చేబ్రోలు చైతన్య, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా విజయ భాస్కర లక్ష్మీ పులగం, యుగతులసి పార్టీ కోటగిరి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థులు కొల్లపు వేణు, గొలుగూరి వెంకట లక్ష్మీనారాయణరెడ్డిల నామినేషన్ పత్రాలు తిరస్కరించామని జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలిపారు.

**అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇలా..**

రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 13 మంది అభ్యర్థులు 21 నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరి నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. గోపాలపురం (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 15 మంది నామినేషన్లు దాఖలు చేయగా నాలుగు తిరస్కరించామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరి నామినేషన్లు తిరస్కరించామన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 18 మంది నామినేషన్లు దాఖలు చేయగా నాలుగు తిరస్కరించామన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 14మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అందులో ఏడు తిరస్కరించినట్టు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలో 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా మూడు తిరస్కరించినట్టు కలెక్టర్ తెలిపారు. అనపర్తి నియోజకవర్గంలో 25 మంది నాయినేషన్లు దాఖలు చేయగా 15 తిరస్కరించామన్నారు.

## జిల్లా వైఎస్సార్ సీపీ
# డాక్టర్స్ వింగ్ కమిటీ నియామకం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ కమిటి నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అనపర్తి నియోజకవర్గానికి చెందిన ముంగి కాశీ ఈశ్వరుడు జనరల్ సెక్రటరీగా, గ్రంధి వెంకటేశ్వరరావు, గుత్తుల తాతబ్బాయి సెక్రటరీలుగా, కిలపర్తి సత్యనారాయణ, చక్కపల్లి రాంబాబులను జాయింట్ సెక్రటరీలుగా నియమించినట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వుల్లో తెలిపింది.

# బుచ్చయ్య మనుషులకే పచ్చ కండువాలు!

- పార్టీలో భారీగా చేరికలంటూ బిల్డప్
- గోరంట్ల తీరుతో ముక్కున వేలేసుకుంటున్న జనం



టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ కుమారుడు గిరిసాయిత్రిలోక్‌కు పార్టీ కండువా వేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: సాధారణంగా ఎన్నికల సమయంలో కొత్తగా పార్టీలోకి వచ్చేవారిని చేర్చుకుని, కండువాలు వేసి ఆహ్వానించడం సహజం. అయితే టీడీపీ సీనియర్ నాయకుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తీరే ఇందుకు భిన్నం. ఇప్పటికే టీడీపీలో ఉన్నవారికే పార్టీ కండువాలు కప్పి, రూరల్ మండలంలో భారీగా టీడీపీలో జనం చేరిపోతున్నారంటూ ప్రచారం చేసుకుంటున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. రూరల్ మండలంలోని బొమ్మూరు గ్రామంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ కార్యక్రమాన్నే ఇందుకు నిదర్శనంగా చూపుతున్నారు. రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ కుమారుడు గిరిసాయిత్రిలోక్, అతని మిత్రబృందానికి టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేరినట్లుగా ప్రచారం చేశారు. నిజానికి ఆయన ఇప్పటికే టీడీపీలో ఉన్నారు. మళ్లీ ఆయనకే కండువా వేసి రూరల్ మొత్తం తన సారథ్యంలో టీడీపీలో చేరిపోతున్నారంటూ హడావుడి చేయడంపై ప్రజల ముందు నవ్వుల పాలైంది.

**వ్యతిరేకతను కవర్ చేసుకునేందుకేనా?**

ఇదిలా ఉండగా అన్ని రాజకీయ పార్టీలు సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే రూరల్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ ఈ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. కీలకమైన అన్ని సామాజికవర్గాలతోనూ సమావేశమై మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఆయా సామాజికవర్గాల నుంచి కూడా అదే రీతిలో స్పందన వస్తోంది. అయితే వైఎస్సార్ సీపీ ప్రచార సరళినే ఫాలో అవుతున్న గోరంట్ల కూడా ఇదే రీతిలో ఆత్మీయ సమ్మేళనాలకు తెరలేపారు. కానీ ఆయా సామాజికవర్గాల నుంచి మాత్రం ఆశించిన రీతిలో ప్రతిస్పందన లేకపోవడం గోరంట్ల శిబిరాన్ని తీవ్రంగా ఆందోళన పెడుతోందని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. రూరల్ నియోజకవర్గంలో ఇటీవలే బీసీ సామాజికవర్గాల సమావేశం అంటూ హడావుడి చేశారు. కానీ అక్కడకు స్వచ్ఛందంగా వచ్చిన వాళ్లెవ్వరూ లేకపోవడంతో సదరు నాయకులు తలలు పట్టుకున్నారు. అలాగే కడియం మండలంలోని ఓ గ్రామంలో ప్రముఖ సామాజిక వర్గం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలని ఆ గ్రామంలోని ఒక ప్రముఖుడికి పురమాయించారు. అదే గ్రామంలో తన ప్రచారం ముగించుకుని గోరంట్ల ఒక గంట ఆలస్యంగా వచ్చారు. అయితే అప్పటికి అక్కడ కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఏరయ్యా.. మీ సామాజికవర్గం వారు అనే సరికి సదరు సామాజికవర్గ పెద్ద తన తెలివిని ప్రదర్శించారు. మీరు 9 గంటలకు వస్తారన్నారని.. కంచనుగా ఆ సమయానికే మా వాళ్ళు వచ్చేశారు. తీరా మీరు 10 గంటలకు వచ్చేసరికి అందరూ వెళ్లిపోయారంటూ కవర్ చేశారు. అయితే అదే గ్రామంలోని టీడీపీ నాయకులకు అసలు విషయం తెలిసినప్పటికీ కిక్కురుమనకుండా సదరు సామాజికవర్గ ప్రముఖుడికే వంత పాడారు. మొత్తం మీద రూరల్ ఏ సామాజికవర్గాన్ని టచ్ చేసినా గోరంట్లపై వ్యతిరేక భావం మాత్రం కొట్టొచ్చినట్లు కనబడుతోందని టాక్ నడుస్తోంది. ఈ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే భారీ చేరికలంటూ సొంత పార్టీ వారికే మళ్లీ మళ్లీ కండువాలు వేస్తున్నారంటున్నారు.

# ఓటు.. ఐదు రకాలు



కాకినాడ సిటీ: ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. ఓటు ద్వారానే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. ఐదు రకాలుగా ఓట్లు ఉన్నాయి. ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. టెండర్ ఓటు, సాధారణ ఓటు, సర్వీస్ ఓటు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ప్రవాస భారతీయులకూ ఓట్లు ఉన్నాయి.

**టెండర్ ఓటు**

ఓటరు జాబితాలో ఓటుహక్కు ఉన్న ఓటరు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసేటప్పటికే ఆ వ్యక్తి ఓటును మరొకరు వేసినా, సదరు వ్యక్తి ఓటు వేయొచ్చు. ఇందుకోసం రిటర్నింగ్ అధికారి వద్ద తాను ఓటు హక్కును వినియోగించుకోలేదని నిరూపించాలి. పోలింగ్ అధికారి హామీతో ఓటును వినియోగించుకోవచ్చు. దీన్నే టెండర్ ఓటు అంటారు.

**సాధారణ ఓటు**

18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు అన్ని రకాల ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కలిగి ఉంటాడు. ఇదే సాధారణ ఓటు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందేందుకు అర్హులు. ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఆధారాలు చూపిస్తే ఓటు హక్కు కల్పిస్తారు.

**సర్వీస్ ఓటు**

సైనికుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం సర్వీస్ ఓటు వేసే అవకాశం కల్పించింది. ఎన్నికల సమయంలో సైన్యంలో విధులు నిర్వహించే సైనిక ఉద్యోగులు ఇక్కడికి రాలేని పరిస్థితిలో ఉంటారు. సైన్యంలోని ప్రధాన అధికారి ద్వారా, తపాలశాఖ ద్వారా ఓటును పంపించవచ్చు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫరబుల్ ద్వారా కూడా పంపవచ్చు.

**పోస్టల్ బ్యాలెట్ ఓటు**

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు కూడా ఓటర్లే. ఎన్నికల సమయంలో వీరు ఎన్నికల విధులు నిర్వహిస్తారు. వారికి కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను తపాలాశాఖ ద్వారా పంపించి ఓటు హక్కును వినియోగించుకుంటారు. మరి కొంతమంది పోలింగ్ ముందురోజే ప్రత్యేకంగా ఉద్యోగుల కోసం పోస్టల్ పోలింగ్‌ను ఏర్పాటు చేసి ఓటు వేయిస్తారు. ఓట్లు లెక్కింపునకు ముందు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో సందర్భంలో పోస్టల్ ఓట్లే కీలకంగా మారతాయి.

**ప్రవాస భారతీయులకూ..**

ప్రవాస భారతీయులకూ ఓటు హక్కు పొందేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో ఫారం 6ఏ ద్వారా దరఖాస్తులు చేసుకుని తగిన ఆధారాలు చూపించి ఓటు హక్కును పొందిన ప్రవాస భారతీయులు ఆసక్తి మేరకు విదేశాల నుంచి వచ్చి తమ ప్రాంత ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది.

## క్లుప్తంగా

### నూకాలమ్మకు రూ.9.66 లక్షల ఆదాయం



నూకాలమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న మహిళలు

**పెద్దాపురం:** కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా జాతర ఆరంభమైన 20 రోజులకు సుమారు రూ.9.66 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ తలాటం సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం దేవదాయ శాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి, దేవదాయ శాఖ ఈఓలు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, జె.సత్యనారాయణ సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ఏటా అమ్మవారి జాతర మధ్యలో హుండీలను తెరిచి లెక్కిస్తున్నామన్నారు. ఈ ఏడాది హుండీల ద్వారా అమ్మవారి జాతర 20 రోజులకు రూ.9,66,695 ఆదాయం వచ్చిందన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**రాజానగరం:** జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. దివాన్‌చెరువు పాతూరుకు చెందిన వర్రే గౌరీశంకరి (55) పంచాయతీ పాత కార్యాలయ భవనం సమీపంలో ఉన్న జగన్మాత ఆలయానికి వెళ్లి, తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి వేగంగా వస్తున్న బైకు ఢీకొంది. ఈ సంఘటనలో ఆమె మృతి చెందింది.

### లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష

**తుని రూరల్:** మోటార్ సైకిల్‌ను ఢీకొని ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.10,500 జరిమానా విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ సీహెచ్ మహేష్ తెలిపారు. 2019 నవంబర్ 2న తుని మండలం తేటగుంట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఎస్‌కే సంసుద్దీన్, ఎస్‌కే లాల్‌బీబీ, ఎస్‌కే సోహమ బేగం ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో లాల్ బీబీ, సోహమ బేగం అక్కడికక్కడే మృతి చెందగా సంసుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. నేరం రుజువు కావడంతో గుంటూరు జిల్లా పురుషోత్తం పట్నానికి చెందిన లారీ డ్రైవర్ జొన్నగడ్డల పద్మరాజుకు శిక్ష పడింది.

### భారీగా మద్యం పట్టివేత

**పిఠాపురం:** నాలుగు ఇళ్లలో దాచి ఉంచిన అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా పిఠాపురం జగ్గయ్య చెరువు, వైఎస్సార్ గార్డెన్స్, పిఠాపురం మండలం కుమారపురంలో ఉన్న నాలుగు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక్కో ఇంట్లో 230 నుంచి 250 వరకూ కేసుల మద్యం దొరికినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని వివరించారు.

# సెల్‌వుల్లో ఆటలేనా..!

- చిన్నారుల్లో పెరిగిన మొబైల్ వీక్షణం
- రోజుకు సగటున మూడు గంటల పైనే
- క్రీడా శిక్షణపై దృష్టి మరలిస్తే మేలు



**రాయవరం:** వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలకు ఎక్కడ లేని ఆనందం.. ఏడాది పాటు తీరిక లేకుండా చదివిన తమ పిల్లలకు కాస్త తీరిక దొరికిందని తల్లిదండ్రులకు సంతోషం ఒకవైపు, సెలవుల్లో మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారోనని ఆందోళన మరోవైపు ఉంటోంది.. ఈ మధ్య కాలంలో 69 శాతం మంది పిల్లలు రోజుకు సగటున మూడు గంటల కంటే ఎక్కువ సమయాన్ని మొబైల్ వీక్షించడానికి కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 96 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కాకుండా ఉండడానికి ఏం చేయాలో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారని మరో సర్వే ద్వారా తెలుస్తోంది. గతంలో విహార యాత్రలకు, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లడం చేసేవారు. కానీ ప్రస్తుతం అది చాలా వరకూ తగ్గింది. ఈ సెలవుల్లో పిల్లలు ఆసక్తి కనబరిచే క్రీడల్లో శిక్షణ అందిస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

**పెరిగిన వినియోగం..**

కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో చాలామంది పిల్లలకు మొబైల్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం, మరికొందరు జీవనోపాధి నిమిత్తం పనులకు వెళ్లిన సందర్భాల్లో పిల్లల క్షేమ సమాచారం కోసం సెల్ ఫోన్లను తమ చిన్నారులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పదేళ్ల లోపు పిల్లలు 42 శాతం, 12 ఏళ్ల లోపు పిల్లలు 71 శాతం , 14 ఏళ్ల లోపు వారు 91 శాతం వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కలిగి ఉంటున్నారని సమాచారం. దీంతో సెల్‌లో గేమ్స్ ఆడేతూ..రీల్స్ చూస్తూ.. సామాజిక మాధ్యమాల్లో కాలం గడిపేస్తున్నారు. ఇటీవల కాలంలో చిన్నారులు ఎక్కువగా ఆటిజమ్ సమస్యకు గురవుతున్నారు. మొబైల్ గేమ్ ఎడిక్షన్స్‌కు లోనవుతున్నారు. 10వ తరగతి వయస్సు వచ్చే బాలికలు అన్‌నోన్ పర్సన్స్‌తో ఛాటింగ్ చేయడం, వారి ప్రభావానికి లోనుకావడం జరుగుతుంది. ఇలాంటి సమస్యలు రాకుండా ముందుగానే పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి.

**క్రీడా శిక్షణ శిబిరాలు**

విద్యార్థులకు వివిధ క్రీడాంశాలపై ఉచితంగా శిక్షణ అందించేందుకు జిల్లా యువజన క్రీడల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానించే పనిలో ఉన్నారు. మే 1 నుంచి 31 వరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, వాలీబాల్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు.



విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఇలా చేయాలి..**

చిన్నారులకు ఫోన్ ఇచ్చే సందర్భంలో యూట్యూబ్ కిడ్స్ మాత్రమే ఓపెన్ చేయాలి. ఇన్‌స్ట్రాగామ్, అడల్ట్ యాప్స్, సోషల్ మీడియా యాప్స్ ఓపెన్ కాకుండా యాప్ లాక్స్ వేసుకోవాలి. పజిల్ గేమ్స్, వర్డ్ బిల్డింగ్, గణితం పజిల్స్ తదితర యాప్స్ మాత్రమే చిన్నారులు వినియోగించేలా చూడాలి. పెద్ద పిల్లల విషయంలో కచ్చితంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. స్మార్ట్ ఫోన్ కంపెనీలు ఫోన్లలో పేరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్ అందుబాటులోకి తెచ్చాయి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ వినియోగ సమయాన్ని నిర్ధారించుకోవాలి.

### అతిగా వినియోగిస్తే అనర్థాలు



అతిగా సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థాలే. ఇది జ్ఞాపక శక్తిపై కూడా ప్రభావితం చూపుతుంది. తలనొప్పి, బ్యాక్ పెయిన్ సమస్యలు వస్తాయి. చికాకు, అసహనం, కోపం, తిరుగుబాటు ధోరణి పెరుగుతుంది. 5–6 ఏళ్ల వయసులో సహజంగా మెదడు ఎదుగుదల ఉంటుంది. ఆ సమయంలో చిన్నారులకు స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉంటే మెదడు ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు ప్రతి 10 మంది చిన్నారుల్లో ముగ్గురికి ఆటిజమ్ లక్షణాలు కనిపిస్తున్నాయి.
– డాక్టర్ పసుపులేటి సౌమ్య, సైకియాట్రిస్ట్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

### తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



పిల్లల సెల్ ఫోన్లు ఎక్కువగా చూడటం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకి తనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. దృష్టిలోపం ఉంటే అది మరింత పెరుగుతుంది. ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించాలి. పిల్లలు ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌లు ఆడే విధంగా తల్లిదండ్రులు చూడాలి. సెలవుల్లో పిల్లలను పిక్నిక్స్‌లకు, వినోదాలకు తీసుకువెళ్లడం మంచిది.
– ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆప్తాలమిక్ ఆఫీసర్, సీహెచ్‌సీ, మండపేట

### రేడియేషన్ బారిన పడవద్దు



సెల్‌ఫోన్ ఎక్కువ ఉపయోగిస్తే పెద్దవాళ్లపైనా ప్రభావం ఉంటుంది. చిన్నపిల్లల్లో కంటి చూపుపై ప్రభావం పడుతుంది. నిద్రలేమి సమస్య రావచ్చు. చాలామంది తల్లిదండ్రులు పిల్లల చేతుల్లో గంటల పాటు ఫోన్ ఉంచుతున్నారు. అలా చూడడం వల్ల పిల్లల మెదడుపై రేడియేషన్ ప్రభావం పడుతుంది. కంటితో పాటు వెన్ను సమస్యలు వస్తాయి. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరం చేయాలి.
–దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం

### ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

పిల్లల కోసం ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది 50 శిబిరాల ఏర్పాటుకు అంచనాలు రూపొందిస్తున్నాం. దీని కోసం అందుబాటులో ఉన్న కోచ్‌లు, మౌలిక వసతులు, ఆసక్తి ఉన్న పీడీల వివరాలు సేకరిస్తున్నాం. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న గేమ్స్, అథ్లెటిక్స్ ఆధారంగా శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర యువజన క్రీడల ఉన్నతాధికారుల ఆమోదం పొందిన తర్వాత మే 1 నుంచి శిబిరాలను ప్రారంభిస్తాం.
– సురేష్, జిల్లా యువజన క్రీడల అధికారి, అమలాపురం

# సత్యదేవునికి భారీ రథం



రథాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, తదితరులు

- రూ. 1.08 కోట్లతో నిర్మాణం
- లాంఛనంగా ప్రారంభం

**తొండంగి:** నిత్య కల్యాణం పచ్చ తోరణంగా విరాజిల్లుతున్న అన్నవరం రత్నగిరిపై సత్యదేవుడు ఊరేగేందుకు భారీ రథం సమకూరింది. రూ.1.08 కోట్లతో నిర్మించిన భారీ టేకు రథాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆలయం వద్ద ఉదయం పది గంటలకు పండితులు ప్రత్యేక హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య రథంపై సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం రథంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. తర్వాత ఆలయ ఈఓ కె.రామచంద్ర మోహన్, పండితులు రథాన్ని లాగి ప్రారంభించారు. సత్యదేవుని కల్యాణోత్సవాల్లో పూర్తిస్థాయిలో రథంపై గ్రామంలో స్వామి అమ్మవారిని ఊరేగిస్తామని ఈఓ వివరించారు. కార్యక్రమంలో అధికారులు, పండితులు పాల్గొన్నారు.

### నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని సంఘ అధ్యక్షుడు జి.ఎలీషాబాబు శుక్రవారం తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు అండర్–17, 23 బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. అండర్–17లో 2006 నుంచి 2010 మధ్యలో జన్మించిన వారు, అండర్–23 విభాగానికి 2001 నుంచి 2006 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు.

### వేధింపుల కేసులో ఇద్దరి అరెస్ట్

**కొత్తపల్లి:** అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన కేసులో అత్త, భర్తను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఉప్పాడకు చెందిన కోటి అనిల్‌కు రాజోలుకు చెందిన అనూషాకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలంగా అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తుండడంతో ఈ నెల 17న ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో అత్త కోటి హైమావతి, భర్త అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై స్వామినాయుడు తెలిపారు.

# మాతా శిశు మరణాల నియంత్రణకు ‘కిల్కారి’ సేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వరరావు



కిల్కారి సేవల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు తదితరులు

**రాజమహేంద్రవరం రూరల్:** మాతాశిశు మరణాల నియంత్రణకు కిల్కారి, వాయిస్ కాల్స్ సేవలు అందిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మాతా శిశు మరణాల నియంత్రణకు కిల్కారి యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ సేవలు అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు స్థానిక ఏఎన్ఎం వద్ద వివరాలను నమోదు చేయించుకొనేటప్పుడు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. మహిళ గర్భం దాల్చిన నాల్గో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకూ, బిడ్డకు ఏడాది వయసు వచ్చేవరకూ 72 సార్లు వాయిస్ కాల్స్ వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్ వద్ద నమోదైన ప్రతి గర్భవతికి 01244588000 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఎం సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకేరోజు మూడు సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. తిరిగి ఆ సందేశాలు వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఆశ కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మెరుగైన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు రూపకల్పన చేశారన్నారు. తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రతి ఆశ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ రాజకుమారి డీపీహెచ్ఎన్‌ఓ వసంతలక్ష్మి, ఎస్‌పీఎం ఎల్.రాజు, రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మోహన్‌రావు, డీసీఎం ఎం.అర్జున్, పీహెచ్‌సీల ఆశ నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

**కంబాలచెరువు:** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం సందర్శించారు. పోలింగ్ జరిగే సమయంలో చేపట్టాల్సిన ముందస్తు భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేశారు. సంబంధిత పోలీసు అధికారులతో కలిసి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని స్టేషన్ ఆఫీసర్లకు ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ వెంట వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# శివయ్య సేవలో భక్తకోటి



కొత్తపేటలో పార్థివ లింగాలు తయారు చేస్తున్న మహిళలు

**కొత్తపేట:** అసంఖ్యాక (కోటి) పార్థివ లింగాల తయారీ మహాయజ్ఞంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు నిమగ్నమవుతున్నారు. మట్టితో శివ లింగాలు తయారు చేస్తూ స్వామి సేవలో తరిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తపేట ఆర్యవైశ్య సంఘాల సమైఖ్య సహకారంతో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 19 నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పార్థివ లింగాల తయారీకి శ్రీకారం చుట్టారు. అమెరికాలో స్థిరపడిన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామ వాసి కోడూరి నారాయణరావు అనే శివ భక్తుని ఆధ్వర్యంలో ఈ కోటి పార్థివ లింగాల తయారీ మహాయజ్ఞం కార్యక్రమం తలపెట్టారు. కోటి శివలింగాలను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని పుణ్యనదుల్లో నిమజ్జనం చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. నారాయణరావు తరఫున రాజమహేంద్రవరానికి చెందిన భోగలింగేశ్వర ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు ముసునూరి అయ్యప్ప ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ ఏడాది మార్చి 16న రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్, లలితానగర్ ప్రాంతాల్లో పార్థివ లింగాల తయారీకి శ్రీకారం చుట్టారు. తరువాత కొత్తపేట, అమలాపురం, అంబాజీపేట, పెనుగొండ తదితర ప్రాంతాల్లో ప్రారంభించారు. ఇంకా వివిధ ప్రాంతాలకు విస్తరించనున్నారు. త్వరలో విశాఖపట్నం జిల్లాలో కూడా చేపట్టనున్నారు. ఈ శివలింగాల తయారీకి అవసరమైన మౌల్డులను యూఎస్‌ఏ నుంచి నారాయణరావు పంపిస్తుండగా, బంక మట్టిని అయ్యప్ప, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించి ఆయా తయారు సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. కొత్తపేటలో వైస్ లేడీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీఘాకోళ్లపు ఉషాకాంతి ఆధ్వర్యంలో ఉదయం కొందరు, మధ్యాహ్నం నుంచి మరికొందరు చొప్పున రోజుకు సుమారు 130 నుంచి 150 మంది వరకూ ఈ శివ సేవలో పాల్గొంటున్నారు. తయారు చేసిన పార్థివ లింగాలు చెక్కు చెదరకుండా అట్ట ట్రేల్లో అమర్చి వాటిని అట్ట పెట్టెల్లో భద్రపరుస్తున్నారు. రోజుకు ఒకరు చొప్పున దాతలు ముందుకు వచ్చి ఈ శివ సేవలో పాల్గొన్న భక్తులకు మజ్జిగ, అల్పాహారం అందిస్తున్నారు.



తయారు చేసిన శివలింగాలు

### శివ భక్తులకు ఆహ్వానం



కోటి పార్థివ లింగాల తయారీ పేరిట జరుగుతున్న శివ సేవలో పాల్గొనడం చాలా అదృష్టంగా భావిస్తున్నాం. నియమ నిష్ఠలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాం. కొత్తపేట వాసవీమాత ఆలయం కేంద్రంగా వాడపాలెం తదితర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతోంది. 5 లక్షల పార్థివ లింగాలు తయారు చేసి పంపించాలనేది మా లక్ష్యం. కులాలకు అతీతంగా ఎవరైనా ఈ సేవలో పాల్గొనవచ్చు.
–శ్రీఘాకోళ్లపు ఉషాకాంతి, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్, కొత్తపేట

# కాకినాడలో చైన్ స్నాచింగ్



ఘటనా స్థలంలో చోరీ వివరాలు సేకరిస్తున్న సీఐ సురేష్‌బాబు

**కాకినాడ క్రైం:** కాకినాడలో శుక్రవారం ఓ మహిళ మెడలో ఆగంతకులు బంగారు గొలుసు లాక్కెళ్లిపోయారు. దీనిపై కాకినాడ వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక దేవాలయం వీధికి చెందిన ఓ మహిళ శుక్రవారం పొరుగున ఉన్న తన స్నేహితురాలితో కలసి మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలో నుంచి సూత్రాలతో ఉన్న సుమారు 50 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లి పోయారు. చోరీని గమనించిన స్థానిక యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి దొంగలను నిలువరించి పట్టుకునే ప్రయత్నం చేశాడు. అయితే ఆ దొంగలు తమ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యారు. ఈ క్రమంలో వారిలో ఒకరి జేబు నుంచి సెల్‌ఫోన్ జారి పడింది. కాకినాడ వన్ టౌన్ సీఐ సురేష్‌బాబు క్రైం కానిస్టేబుల్ రాంబాబుతో కలసి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేయగా వారు వదిలి వెళ్లిన ద్విచక్ర వాహనం కూడా దొంగిలించిన వాహనమేనని తేలింది. దీంతో ప్రత్యేక బృందాలను కేసు విచారణ నిమిత్తం నియమించారు. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

# రేపు ‘తిరుమల’లో అవగాహన సదస్సు

**రాజమహేంద్రవరం రూరల్:** తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో 6, 7, 8, 9, 10వ తరగతుల్లోకి వచ్చే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాతేరు రాజమహేంద్రవరంలోని క్యాంపస్‌లో ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. తమ పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ మరియు ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఎలా సంసిద్ధం కావాలో ఈ సదస్సులో వివరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79970 71672, 77024 49686 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.